క్లుప్తంగా

99.08 శాతం పింఛన్ల పంపిణీ

పెనుగంచిప్రోలు: మండలంలో మంగళవారం ఐదోరోజుకు సామాజిక పింఛన్ల పంపిణీ 99.08 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ శ్రీహర్ష సాయి తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. పెనుగంచిప్రోలుకు చెందిన వలంటీర్ మెట్టశాల జెన్నమ్మ తుపానుకారణంగా జోరువాన కురుస్తున్నా 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చెప్పల మాధవ రావుకు రూ.10 వేలు పింఛన్ అందించింది. దీంతో మాధవరావు కుటుంబసభ్యులు వలంటీర్‌ను అభినందించారు.

ఉచిత వైద్య సేవలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న స్మైలీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో బుధవారం పలు విభాగాలకు సంబంధించి ఓపీ ఉచితంగా చూస్తారని ఆస్పత్రి మేనేజ్‌మెంట్ డాక్టర్ తమ్మారెడ్డి సందీప్ మంగళవారం తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించు ఓపీ సేవలను ఆర్థోపెడిక్ , పీడియాట్రిక్(చిన్న పిల్లల వైద్యం), గైనకాలజీ(స్త్రీల ప్రసూతి వైద్యం), జనరల్ వైద్యం, జనరల్ సర్జన్ వైద్యానికి సంబంధించి ఉచితంగా అందజేస్తారని పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్తంభించిన జనజీవనం

వీరులపాడు: తుపాను కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరపి లేని వర్షంతో జనజీవనం స్తంభించింది. మంగళవారం ఉదయం నుంచి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురుస్తుండటంతో ప్రజలు ఒకింత ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే రైతులు చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు నానాపాట్లు పడుతున్నారు.

10న లక్ష దీపోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విశ్వ హిందూ పరిషత్ విజయవాడ మహానగర్ నారాయణి సేన సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీఆదివారం సాయంత్రం 5.30 గంటలకు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నామని నారాయణీ సేన సంస్థ అధ్యక్షుడు పిట్టల గోవింద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా కార్తిక మాసం సందర్భంగా లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పాల్గొనాలనుకునేవారు 10వ తేదీలోపు 77949 78373 నంబరులో పేర్లు నమోదు చేసుకోవాలని, పాల్గొన్న ప్రతి ఒక్కరికి రుద్రాక్ష అందజేస్తామని వివరించారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): అబాకస్ ఇండియా ఆధ్వర్యాన 20వ జాతీయ సిప్(సోషబుల్ ఇంటలెక్చువల్ ప్రోగ్రెసివ్) అబాకస్ మెంటల్ అర్థమెటిక్ కాంటెస్ట్ నవంబరు 26న హైదరాబాద్‌లో జరిగాయి. వాటిలో పాల్గొన్న లబ్బీపేటలోని సిప్ అకాడమీ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటినట్లు సిప్ అబాకస్ స్టేట్ హెడ్ గోపాలకృష్ణ తెలిపారు. తమ బ్రాంచి నుంచి 12 మంది విద్యార్థులు పోటీపడగా, వివిధ స్థాయిల్లో అందరూ ట్రోఫీలను సాధించినట్లు పేర్కొన్నారు. విజేతలకు తెలంగాణ మానవ హక్కుల ముఖ్యకార్యదర్శి డీఆర్ గార్గ్ , సిప్ అబాకస్ ఎండీ దినేష్ విక్టర్‌ల చేతుల మీదగా బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను గోపాలకృష్ణ అభినందించారు.

దుర్గమ్మ సన్నిధిలో సహస్ర లింగార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం పురస్కరించుకుని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం సహస్ర లింగార్చన నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని నటరాజ స్వామి వారి ఆలయం వద్ద ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి వారికి విశేష అలంకరణ జరిగింది. సాయంత్రం శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్లకు పంచహారతుల సేవ చేశారు. సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు.

మహిళను బెదిరించిన ఇద్దరు వ్యక్తులపై కేసు

పెనమలూరు: కానూరులో మహిళను బెదిరించిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు అశోక్ నగర్‌కు చెందిన బావినేని మాధురి లతా రెసిడెన్సీలో ఉంటోంది. అదే అపార్టుమెంట్‌లో ఉంటున్న కొల్లి రామకృష్ణ, పర్వతనేని వీరభద్రరావులతో అపార్టుమెంట్‌లో విషయమై వివాదం ఉంది. ఈ నేపథ్యంలో పై ఇద్దరు వ్యక్తులు మాధురిని ప్రతినిత్యం దూషిస్తూ బెదిరించసాగారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

తుపానుతో రైతుల ఆందోళన

- నేల కొరిగిన వరి పైరు
- కల్లాల్లోనే ధాన్యపు రాశులు



పెనుగంచిప్రోలు మునేరు అవతల నేలవాలిన వరి



వత్సవాయి మండలం రేగులగడ్డ వద్ద ధాన్యం చుట్టూ నీరు రావడంతో రైతుల పాట్లు

పెనుగంచిప్రోలు: మిచాంగ్ తుపాను ప్రభావంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. మంగళవారం తెల్లవారు జామునుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతోపాటు చిన్నపాటి గాలులు కూడా వీచాయి. పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో పలు చోట్ల వందల ఎకరాల్లో వరి పైరు నేల వాలింది. దీంతో కోతకు వచ్చిన వరి కంకులు నీటిలో తేలి ఆడుతున్నాయి. ఆరుబయట, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడవకుండా రైతులు పట్టాలు కప్పుకున్నా ఎడతెరపి లేకుండా వర్షాలతో అక్కడక్కడా ధాన్యపు రాశుల కిందకు నీరు చేరుతోంది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెనుగంచిప్రోలు మండలంలో తహసీల్దార్ కె లక్ష్మీకల్యాణి, ఏఓ కె.రామసుబ్బారెడ్డి, ఆర్ఐ జనార్దనరావు పెనుగంచిప్రోలు, ముచ్చింతాల, అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు గ్రామాల్లో కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు ఆర్బీకేల్లో ధాన్యం విక్రయించుకోవాలని, తేమ శాతం ఎక్కువగా ఉన్నా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు, కొణకంచి ఆర్బీకేల ద్వారా సొసైటీలు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు.

కుండపోతగా వర్షం

కంచికచర్ల : మిచాంగ్ తుపాను కారణంగా మంగళవరం మండలంలో కుండపోతగా వర్షం కురిసింది. రైతులు అక్కడక్కడా కోసిన మిర్చి పంటను కల్లాల్లో ఆరబెట్టగా అవి తడిసిపోయాయి. రైతులు పట్టాలు వేసినప్పటికీ ఈదురు గాలుల వల్ల పట్టాలు, పరదాలు చెల్లాచెదురయ్యాయి. కంచికచర్లలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం 8గంటల వరకు 32.3 మి.మీ. వర్షపాతం నమోదయిందని రెవెన్యూ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షపాతం 10.8 మి.మీ. నమోదయిందని తహసీల్దార్ శంకరబాబు తెలిపారు. మండలంలోని గనిఆత్కూరు, చెవిటికల్లు, కొత్తపేట, గొట్టుముక్కల, పరిటాల, మోగులూరు, మున్నలూరు, కునికెనపాడు తదితర గ్రామాల్లో వరి పంటలన్నీ నీటమునిగాయి. వరి పంటను కోసిన రైతులు పంటను కల్లాల్లో ఆరబెడితే వర్షానికి తడిసిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలను తహసీల్దార్ పబ్బూరి శంకరబాబు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పరిశీలించారు. డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, ఏఎస్ఓ దుర్గా ప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో కూడిన వర్షం

నందిగామ: మిచాంగ్ తుపాను కారణంగా నందిగామ ప్రాంతంలో కూడా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలు నేలకొరగాయి. అధికారుల లెక్కల ప్రకారం నందిగామ నియోజకవర్గ పరిధిలో 14,101 ఎకరాలలో రైతులు ఈ సంవత్సరం వరి పంటను సాగు చేశారు. దానిలో ఇప్పటికే 540 ఎకరాల్లోని పంట రైతుల ఇళ్లకు చేరింది. మిగిలిన 13,561 ఎకరాల పంట కోతలకు సిద్ధంగా ఉంది.

తడుస్తున్న పత్తి

తుపాను ప్రభావంతో పత్తి రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కోతకు సిద్ధంగా ఉన్న ప్రతి వర్షానికి తడిసిపోతోంది. అధికారుల లెక్కల ప్రకారం నందిగామ నియోజకవర్గ పరిధిలో ఈ సంవత్సరం 33,675 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పత్తి పొలాలు 2,3 కోతల దశలో ఉంది. ఈ తరుణంలో తుపాను కారణంగా తడిసి ముద్ద అవుతున్న పత్తిని చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు.

నష్టంపై అంచనాలు సిద్ధం చేస్తున్న అధికారులు

నియోజకవర్గంలో పంట నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనాలను సిద్ధం చేస్తున్నారు. దీనిపై వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాస్‌ను వివరణ కోరగా పంట నష్టంపై అంచనాలు తయారు చేస్తున్నామన్నారు. ఇప్పటికే అన్ని మండలాలలోని వ్యవసాయ శాఖ అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ప్రాథమిక అంచనాల ప్రకారం నందిగామ నియోజకవర్గ పరిధిలో 4,710 ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలకొరిగి నీట మునిగినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో వర్షం తగ్గిన తర్వాత నష్టం వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

ప్రజలు ఇళ్లకే పరిమితం

జగ్గయ్యపేట: తుపాను నేపథ్యంలో రెండు రోజులుగా ఎడతెరపి లేని వర్షం కురుస్తుండటంతో ప్రజలు ఇళ్లకు పరిమితమయ్యారు. జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలలోని పలు గ్రామాల్లో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని రైతులు పరదా పట్టాలు కప్పుకుని కాపాడుకుంటున్నారు. తుపాను తీవ్రత గురించి నాలుగు రోజులుగా మండల యంత్రాంగం ప్రజలకు అవగాహన కలిగించడమే కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొందరు రైతులు కోతలు కోసి కల్లాల్లో ఆరబెట్టగా కొన్ని గ్రామాలలో వరి కోతలు కోయకపోవడంతో పంట నేలమట్టమైందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయా మండలాల్లోని రెవెన్యూ, వ్యవసాయాధికారులు పంట పొలాలను పరిశీలించారు. మండలంలోని షేర్‌మహ్మద్‌పేట, అనుమంచిపల్లిలో వరి కల్లాల్లోని రైతులు పంటలను కాపాడుకోవడంతో పాటు ఆరబెట్టిన ధాన్యాన్ని మిల్లర్లకు విక్రయిస్తున్నారు.



కంచికచర్ల మండలం గనిఆత్కూరులో పడిపోయిన వరిపనలను లేపుతున్న రైతులు



కంచికచర్ల మండలం గొట్టుముక్కలో ఆరబోసిన వడ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ శంకరబాబు



నందిగామ మండలం రాఘవాపురం ప్రాంతంలో నీట మునిగిన వరి



నందిగామ మండలం పల్లగిరి సమీపంలో వర్షానికి తడుస్తున్న పత్తి



అనుమంచిపల్లిలో ధాన్యంపై కప్పిన పరదా పట్టాలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి ఇందిర, పక్కన తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ హర్షసాయి

పెనుగంచిప్రోలు: తుపాన్ ప్రభావంతో ఎడతెరపి లేకుండా వర్షాలు పడుతున్న కారణంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎం.శ్రీహర్షసాయి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండల స్థాయి అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సాధ్యమైనంత వరకు వర్షాలు తగ్గేవరకు ఇళ్లలోనే ఉండాలన్నారు. మండలంలో 151 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. వైద్యాధికారి పి.ఇందిర మాట్లాడుతూ ముసురు, చలిగాలులకు ప్రజలంతా పలు జాగ్రత్తలు పాటించడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ కరెంట్ స్తంభాలకు, విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలన్నారు. ఏఓ కె.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్‌లో సుమారుగా ఐదు వేల ఎకరాల్లో వరి సాగు చేయగా 500 ఎకరాల్లో ధాన్యం కోతలు పూర్తయి రైతులు విక్రయించుకున్నట్లు పేర్కొన్నారు. 700 ఎకరాల్లో వర్షాలకు వరి నేలవాలిందన్నారు.

వత్సవాయిలో..

వత్సవాయి మండలంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాలేదని తహసీల్దార్ పి.వైకుంఠరావు అన్నారు. ఏఓ రవికుమార్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 2.081 ఎకరాల్లో వరి సాగు కాగా ఇప్పటి వరకు 30 ఎకరాల్లో కోతలు పూర్తయి రైతులు ధాన్యం అమ్ముకున్నారు. 100 ఎకరాల్లో వరి వర్షాలకు నేలవాలిందన్నారు. దీనిపై అధికారులకు నివేదిక ఇచ్చామన్నారు.

ప్రభుత్వం రైతు పక్షపాతి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవిశంకర్

నందిగామ: ప్రభుత్వం రైతుల పక్షపాతి అని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ అన్నారు. మండలంలోని మాగల్లులోని రైతు భరోసా కేంద్రం వద్ద మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో వర్షాలకు ధాన్యం దెబ్బతినకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆఫ్‌లైన్ పద్ధతి ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. గతంలో ఆన్‌లైన్ పద్ధతి ద్వారా రైతు భరోసా కేంద్రం ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేవలం కేటాయించిన మిల్లులకు మాత్రమే తరలించే అవకాశం ఉండేదన్నారు. ప్రస్తుతం తుపాన్ నేపథ్యంలో ప్రభుత్వం దానిని సడలించి ఆఫ్‌లైన్ పద్ధతి ద్వారా కొనుగోలు చేసి, వాటిని దగ్గరలోని ఏదైనా మిల్లుకు తరలించుకునే అవకాశం ఉందన్నారు. దీనివల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

పంట నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కంచికచర్ల: తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయని పలు జాగ్రత్తలు తీసుకుని పంట నష్టాన్ని నివారించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి కే విజయకుమార్ మంగళవారం తెలిపారు. కోతకు సిద్ధంగా ఉన్న వరిని వర్షాలకు ముందు కోయరాదని పేర్కొన్నారు. ఒకవేళ కోసినా ఆరని పనలను కుప్పలు వేసేటప్పుడు ఎకరానికి 25 కేజీల చొప్పున ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్పలు వేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చని తెలిపారు. కోత కోసిన పనలు వర్షానికి తడిసినట్లయితే గింజ మొలకెత్తకుండా ఉండటానికి ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేలా పిచికారీ చేయాలన్నారు. పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే పనలను గట్లపైకి తెచ్చి విడగొట్టి ఉప్పు ద్రావణాన్ని చల్లాలని తెలిపారు. నూర్చిన ధాన్యాన్ని రెండు మూడు రోజుల పాటు ఎండబెట్ట లేకపోతే కుప్పలలో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుందన్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించేందుకు ఒక క్వింటాళ్ల ధాన్యానికి కేజీ ఉప్పు, 20కేజీల పొడి ఊక కలిపి ధాన్యాన్ని పోగు పెట్టటం వల్ల గింజ మొలకెత్తకుండా చెడిపోకుండా నివారించుకోవచ్చన్నారు. ఎండ కాసిన తర్వాత ధాన్యాన్ని ఎండబోసి తూర్పారా బట్టి నిల్వ చేసుకోవాలని పేర్కొన్నారు. రంగు మారి, తడిసిన ధాన్యాన్ని పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంత వరకు తగ్గించుకోవచ్చని ఏఓ తెలిపారు.

వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయం



పేట జెడ్పీ బాలుర హైస్కూల్ రోడ్డుపైకి చేరిన వరద నీరు



పేటలోని 29వ వార్డులో వరద నీరు

జగ్గయ్యపేట అర్బన్: తుపాను ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరపి లేని వర్షాలతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అనేక చోట్ల రోడ్లపైకి నీరు చేరడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. డ్రెయిన్లు పొంగి రోడ్లపైకి నీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. ముఖ్యంగా జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ రోడ్డు, ఫైర్ ఆఫీసు, సబ్‌జైల్ రోడ్డు జలమయమయ్యాయి.

సహాయ చర్యలకు అధికార యంత్రాంగం సిద్ధం

తుపాను వలన ముంపునకు గురయ్యే ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల నుంచి బాధితులకు సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం సిద్ధం చేశారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని ఆయన సమీక్షిస్తున్నారు.

బుడమేరులో నీటి పారుదలకు చర్యలు



జక్కంపూడి వద్ద పనులు చేపట్టిన సిబ్బంది

జక్కంపూడి(విజయవాడరూరల్): మిచాంగ్ తుఫాన్ కారణంగా రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బుడమేరులో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. బుడమేరులో వరద ఉద్ధృతి మరింత పెరిగితే రాయనపాడు, జక్కంపూడి, గొల్లపూడి, ఈలప్రోలు గ్రామాల్లో వరి పొలాలు ముంపునకు గురికాకుండా ఉండేందుకు ఇరిగేషన్ అధికారులు బుడమేరులో అడ్డుకట్టలను తొలగించే పనులు చేపట్టారు. జక్కంపూడి-గొల్లపూడి గ్రామాల మధ్య బుడమేరు కాల్వపై రైల్వే ట్రాక్ నిర్మాణం నిమిత్తం బాక్స్‌ను నిర్మించారు. అందుకుగాను మూడు తూముల్లో రెండు తూములు మూసి ఉండడంతో పై నుంచే వచ్చే బుడమేరు ఉధృతికి నష్టం జరగకుండా ఉండేందుకు రెండు తూముల నుంచి కూడా బుడమేరు వరద పారుదల అయ్యే విధంగా ఇరిగేషన్ ఏఈ రాజశేఖర్ పనులు చేయిస్తున్నారు. జక్కంపూడి నుంచి వరద నీరు ఎనికేపాడు గ్రామంలోని అండర్‌టన్నెల్ వరకు వెళ్తుందని ఏఈ తెలిపారు. కోతలకు సిద్ధంగా ఉన్న వరి పంట కొత్తూరు, తాడేపల్లి, జక్కంపూడి, వేమవరం , షాబాదు, పైడూరుపాడు, రాయనపాడు గ్రామాల్లోని నేలకు ఒరిగింది.

మల్లేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన



స్వామికి లక్ష బిల్వార్చన పూజ చేస్తున్న అర్చకులు



భస్మాభిషేక అలంకరణలో రామలింగేశ్వర స్వామి

తిరుమలగిరి (జగ్గయ్యపేట): గ్రామంలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి ఆలయంలోని ఉపాలయం మల్లేశ్వర స్వామికి కార్తిక మాసం సందర్భంగా మంగళవారం అర్చకులు లక్ష బిల్వార్చన పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష తులసీదళాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీరామ వరప్రసాదరావు, అర్చకులు బాల వీర మణికంఠ పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి భస్మాభిషేకం

నందిగామ(చందర్లపాడు): మండలంలోని పొక్కునూరుని రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం నేపథ్యంలో మంగళవారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. వేకువజామునే పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. అనంతం స్వామికి భస్మాభిషేకం నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

జగ్గయ్యపేట అర్బన్: కార్తిక మాసం సందర్భంగా పట్టణంలోని పలు శైవక్షేత్రాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాలేటి తీరాన ఉన్న మఠం శివాలయంలో స్వామికి ప్రీతిగా మహాన్యాస పూర్వక నారాయణ గాయత్రీ రుద్ర పాసుపత హోమం, పంచామృతాల, వివిధ పండ్ల రసాలతో అభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు.



మఠం శివాలయంలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

జాతీయ స్థాయి పోటీలకు కేబీఎన్ విద్యార్థులు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తమ కళాశాల ఇంటర్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో ప్రతిభను కనబరచి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికయ్యారని మంగళవారం కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 హ్యాండ్‌బాల్, నెట్‌బాల్ పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టారని పేర్కొన్నారు. త్వరలో జరగబోయే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు గౌతమ్, శ్రావణి, సత్య, నెట్‌బాల్‌లో అజాముద్దీన్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన క్రీడా విభాగాధిపతి డి.హేమచంద్రరావులను కళాశాల కార్యదర్శి శ్రీనివాసు, ఇంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి భాగ్యకుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అభినందించారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్ (కార్మికవాడ) విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. మిచాంగ్ తుపాను నేపథ్యంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ఆటోనగర్ ఏడీఏ శివకుమార్ సిబ్బందితో వర్షంలో సైతం పనులు చేయిస్తున్నారు. మంగళవారం పటమట పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న సబ్‌స్టేషన్ వద్ద రెండు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కండక్టర్లు ఫెయిల్ అయ్యాయి. దీంతో వెంటనే సిబ్బందిని అప్రమత్తంచేశారు. విద్యుత్ తీగలకు అడ్డంగా వచ్చిన చెట్ల కొమ్మలను నరుకుతున్నారు. ఏడీఏ శివకుమార్ మాట్లాడుతూ కార్మికవాడలో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

సద్గురు సంప్రదాయాన్ని కాపాడుకోవాలి



కీర్తనలను ఆలపిస్తున్న సాత్విక, భువనకృతి వాద్యసహకారం అందిస్తున్న చంద్రకాంత్, సుధాకర్

విజయవాడ కల్చరల్: సద్గురు సంప్రదాయాన్ని కాపాడుకోవాలని స్వరఝరి సంగీత సేవా సంస్థ అధ్యక్షుడు మోదుమూడి సుధాకర్ అన్నారు. గాయక సార్వభౌమ సంగీత పరిషత్, స్వరఝరి సంగీత పరిషత్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించే గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 140వ జయంతి సందర్భంగా నిర్వహించే సంగీత ఉత్సవాలు గాంధీనగర్‌లోని చిట్టూరి కళావేదికమీద మంగళవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమాలను ప్రారంభించిన సుధాకర్ మాట్లాడుతూ పారపల్లి రామకృష్ణ పంతులు గురు సంప్రదాయాన్ని పాటిస్తూ అనేక మందిని సంగీత విద్వాంసులుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. స్వరఝరి నిర్వాహక సంఘ సభ్యురాలు అంజరా సుధాకర్ సంస్థల లక్ష్యాలను వివరించారు. తొలి రోజు కార్యక్రమంలో యువ సంగీత కళాకారులు సాత్విక, భువనకృతి వాగ్గేయకార కీర్తనలతో పాటు రామకృష్ణయ్య పంతులు స్వరపరచిన కీర్తనలను మధురంగా గానం చేశారు. హేమాద్రి చంద్రకాంత్ వయోలిన్‌పై రాయప్రోలు సుధాకర్ మృదంగంపై సహకరించారు.

అలరించిన సినీ సంగీత విభావరి



గీతాలను ఆలపిస్తున్న కృష్ణకుమారి నాగేశ్వరరావు

విజయవాడ కల్చరల్: శ్రీముురుగ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నాపాట తేట తెలుగు పాట పేరుతో మంగళవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. సీనియర్ గాయని మురిగిపూడి కృష్ణకుమారి నాగేశ్వరరావు ఏక గళం కార్యక్రమంలో భాగంగా పలు తెలుగు హిందీ చిత్రగీతాలను ఆలపించారు. నిర్వాహకుడు రమాశంకర్ మాట్లాడుతూ రాజీలేకుండా విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తున్నట్లు చెప్పారు. ట్రస్ట్ ద్వారా వికలాంగులకు ట్రై సైకిల్స్‌ని అందజేస్తున్నామని తెలిపారు. గాయని కృష్ణకుమారిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పలువురు పాల్గొన్నారు.